# ఫిబ్రవరి 28 సార్వత్రిక సమ్మెకు సదస్సు సంఘీబావం తెలుపుతున్నది

సుందరయ్య విజ్ఞాన కేంద్రం **రాష్ట్ర సదస్సు** తేది: 16.02.2012

## తీర్మానం

రాష్ట్రంలో, కేంద్రంలో పరిపాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాలు సరళీకరణ సంస్కరణల అమలును ముమ్మరం చేస్తున్నాయి. ప్రజల మీద నిరంతరం రకరకాల భారాలు మోపుతున్నాయి. నిత్యజీవితావసర సరుకుల ధరలు ఆకాశాంనంటుతున్నాయి. వ్యవసాయం సంక్షోభంలో పడింది. రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. దీనితో సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. పేద, మధ్యతరగతి రైతుల పరిస్థితి ఆందోళనకరంగా దిగజారుతున్నది. అసంఘటితరంగ కార్మికులు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, వృత్తిదార్లు, రైతులు ప్రత్యేకంగా మహిళల బాధలు తీవ్రమయ్యాయి.

పరిస్థితిని చక్కదిద్దడానికి పూనుకోకుండా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తమ తప్పుడు విధానాలు ఇంకా ముమ్మరంగా అమలు జరపడానికి పూనుకుంటున్నాయి. ఇటువంటి పరిస్థితిలో ప్రజాప్రతిఘటన లేకుండా ప్రభుత్వాల విధానాలను నిలవరించడం సాధ్యం కాదన్న నిశ్చయానికి వచ్చిన కార్మిక సంఘాలు సంయుక్తంగాను, విడివిడిగాను ఫిబ్రవరి 28వ తేదీన దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి.

ధరలు తగ్గించాలని, అసంఘటిత, తాత్కాలిక ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణను నిలిపి వేయాలని, చిల్లర వర్తకం ఇంకా ఇతర రంగాల్లోకి విదేశీ పెట్టుబడులను అనుమతించరాదని, ప్రజాపంపిణీ వ్యవస్థను బలహీనం చేసే ప్రయత్నాలను విరమించాలని, గ్యారంటీతో కూడిన పెన్షన్ స్కీంను ప్రవేశపెట్టాలని, కనీస వేతనం పెంచి అమలు చేయాలని, సంఘ హక్కును బలహీనం చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలనే డిమాండ్లతో సార్వత్రిక సమ్మె జరుగుతున్నది. ఈ సమ్మెకు ఈ సదస్సు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నది.

### ఫిబ్రవరి 28 రాష్ట్ర బంద్‌కు 9 వామపక్ష పార్టీల పిలుపు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజల పరిస్థితి రోజురోజుకీ దిగజారుతున్నది. ప్రజలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం అంతర్గత ముఠా కుమ్ములాటల్లో సతమతమవుతున్నది. పరిపాలన స్థంభించి పోయింది. ప్రజా సమస్యలను పట్టించుకునే నాధుడే లేడు. రాష్ట్ర ఆర్థికపరిస్థితి క్షీణించటంతో ఇప్పటికే 2011సం॥లో 10వేల కోట్ల రూపాయిల భారాలు ప్రజలపై మోపబడ్డాయి. ఈ సంవత్సరంలో మరో 15వేల కోట్ల రూపాయిల భారాలు వేయబోతున్నారు. అంతేగాక ఇప్పటివరకూ నడుస్తున్న సంక్షేమ పథకాలు దెబ్బతీస్తున్నారు.

మద్యం మాఫియాల ముడుపులపై ఎసిబి చేసిన దర్యాప్తు వివరాలను ప్రభుత్వం ప్రజలకు, చివరకు శాసనసభకు తెలియపర్చడానికి ప్రభుత్వం నిరాకరిస్తున్నది. ముడుపులు ముట్టిన మంత్రులు, రాజకీయ నాయకుల పేర్లను బయట పెట్టాలి. మద్యాన్ని ప్రోత్సహించే విధానానికి స్వస్తి చెప్పి, మద్య నియంత్రణ విధానాన్ని రూపొందించి అమలుచేయాలి.

విద్యుత్ చార్జీలు, ఫ్యూయల్ సర్‌చార్జీల పేరుతో వినియోగదారులపై రు. 11వేల కోట్ల భారం మోపడానికి ప్రతిపాదనలు రూపొందించారు. ప్రస్తుతం డిస్కాంలు రు. 5వేల కోట్ల భారాన్ని వేయడానికి ప్రతిపాదించాయి. విద్యుత్ కొరతతో, కోతలతో రాష్ట్రం దీర్ఘకాలం నుండి ఇబ్బందిని ఎదుర్కొంటున్నా, పరిస్థితిని అధిగమించేందుకు ప్రభుత్వ విద్యుత్ సంస్థలను ప్రోత్సహించే సమగ్ర విద్యుత్ విధానం ప్రభుత్వం రూపొందించలేదు. పైపెచ్చు మర్చంట్ పవర్‌ప్లాంట్‌లకు దాసోహం అయింది. సోంపేట, కాకరాపల్లిలలో ఆరుగురు రైతులను పొట్టన పెట్టుకున్న ప్రభుత్వం, భూముల్ని తిరిగి ఇవ్వడానికి నిరాకరిస్తున్నది.

రాష్ట్రంలోని బాక్సైట్, ఇనుప ఖనిజం, తదితర గనులన్నింటినీ పలుకుబడి కల్గిన వారికి కట్టబెట్టి, లూఠీ చేయిస్తున్నది. అక్రమ కేటాయింపులన్నింటినీ రద్దు చేయడానికి నిరాకరిస్తున్నది.

ఎస్‌సి, ఎస్‌టి స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్ అమలుకుద్దేశించిన నోడల్ ఏజెన్సీకి స్వయం ప్రతిపత్తిని కల్పించడానికి నిరాకరిస్తున్నది.

వృత్తులన్నింటినీ నిర్లక్ష్యం చేసి, వృత్తిదార్ల జీవితాలను నాశనం చేస్తున్నది. మైనార్టీలకు, వృత్తిదార్లకు బడ్జెట్‌లో సబ్‌ప్లాన్ పద్ధతిని ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదు.

ప్రభుత్వ భూములను అక్రమంగా పలుకుబడి కల్గిన సంస్థలకు, వ్యక్తులకు కైంకర్యం చేసి ప్రభుత్వం అక్రమాలకు పాల్పడింది. ఆ భూములన్నింటినీ స్వాధీనం చేసుకోవడానికి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడానికి నిరాకరిస్తున్నది. శాసనసభా కమిటీ పరిధిలోకి అక్రమ భూముల లావాదేవీలన్నింటినీ తీసుకురాకుండా దాన్ని ఒక ప్రహసనంగా మారుస్తున్నది. మరోవైపు పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వకుండా ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేయకుండా మొండిగోడలుగా మిగిల్చి పేదలను నిర్లక్ష్యం చేస్తున్నది.

రాష్ట్రంలో 879 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నట్లు, రు.5వేల కోట్ల పెట్టుబడులు రైతులు నష్టపోయినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర బృందాలు ఆలస్యంగా పర్యటించినప్పటికీ ఇంతవరకూ పరిహారాలు చెల్లించే దిశగా చర్యలు చేపట్టలేదు. ఆత్మహత్యలను పాల్పడిన రైతులకు ఎక్స్‌గ్రేషియో కుంటిసాకులతో చెల్లించడానికి నిరాకరిస్తున్నది. కరువు, వెనుకబడిన ప్రాజెక్టులను గుర్తించి వాటిని పూర్తి చేయడంలో విఫలం అయింది.

వస్త్ర వ్యాపారులు వ్యాట్ పన్నును రద్దుచేయాలని ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిరాకరిస్తున్నది.

కాంట్రాక్టు కార్మికులకు జివో 3ను, బీడీ కార్మికుల జివో 41 అమలు చేయకుండా లక్షల శ్రామికుల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నది. దశాబ్దాల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు, తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులర్ చేయకుండా తొలగించే ప్రయత్నాలు చేస్తున్నది.

ఆరోగ్య రంగాన్ని పూర్తి ధ్వంసం చేసింది. జూనియర్ డాక్టర్లు, 104, 108 సిబ్బంది సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వ వైద్య సంస్థల్లో సౌకర్యాలను మెరుగుపర్చకుండా కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్నది.

ప్రపంచబ్యాంకు షరతులకు తలొగ్గి, పట్టణాల్లో ఆస్తిపన్ను, నీటిపన్ను, చెత్తపన్ను ఇంకా రకరకాల పేర్లతో విపరీతంగా భారాలు మోపుతున్నది. మురికివాడల ప్రజలను దౌర్జన్యంగా తొలగించి, ఊరిబైటకు వెళ్లగొడుతున్నది.

రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ అస్థవ్యస్థ పరిస్థితుల మూలంగా ప్రజాసమస్యలు మరుగునపడి పోతున్నాయి. జరుగుతున్న శాసనసభ సమావేశాల్లోనైనా ప్రజాసమస్యలు చర్చకు వస్తాయనుకుంటే ఏదో ఒక మిషతో సభను వాయిదా వేస్తూ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నది. ఈ బాధ్యతా రాహిత్యాన్ని అడ్డుకోవాల్సి వుంది. ప్రజాసమస్యలను మరల రాజకీయ ఎజండా పైకి తేవాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రజా ఒత్తిడి లేకుండా ఇది సాధ్యం కాదు. అందుకే ఈ సదస్సు ఫిబ్రవరి 28వ తేదీన రాష్ట్ర బంద్‌ను పాటించడం ద్వారా ప్రజానీకం తమ ఆగ్రహాన్ని, నిరసనను వ్యక్తం చేయాలని కోరుతున్నది. ఈ కార్యక్రమానికి అన్ని పార్టీలు, సంఘాలు, సంస్థలు, ప్రజాస్వామిక శక్తులు, వ్యక్తులు, వ్యాపార వర్గాలు మద్దతు తెలపాల్సిందిగా, సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

| | | | |
|---|---|---|---|
| **సిపిఐ** | **సిపిఐ(ఎం)** | **సిపిఐ(ఎం.ఎల్)న్యూడెమోక్రసి** | **ఎంసిపిఐ(యు)** |
| **సిపిఐ(ఎం.ఎల్)** | **సిపిఐ(ఎంఎల్)లిబరేషన్** | **ఎస్‌యుసిఐ(సి)** | **సిపిఐ(ఎంఎల్)** |
| **ఆర్.ఎస్.పి** | **ఫార్వర్డ్‌బ్లాకల** | **ఎంఎల్ కమిటీ** | |

= = =

# ఫిబ్రవరి 28 సార్వత్రిక సమ్మెకు సంఘీబావం, రాష్ట్రబంద్‌కు పిలుపు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం **రాష్ట్ర సదస్సు** తేది: 16.02.2012

---

<u>సదస్సులో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు:</u>

- ఎన్ మూర్తి ( సిపిఐ ఎం.ఎల్) లిబరేషన్ రాష్ట్రకార్యదర్శి అధ్యక్షత వహించారు.

- డా. కె నారాయణ, సిపిఐ

- బి వి రాఘవులు, సిపిఐ(ఎం)

- డి వి కృష్ణ, సిపిఐఎం.ఎల్ న్యూడెమోక్రసీ

- గుర్రం విజయకుమార్, సిపిఐ (ఎం.ఎల్)

- వి వెంకటరెడ్డి, యంసిపిఐ (యు)

- కొల్లిపర వెంకటేశ్వర రావు, ఎం.ఎల్ కమిటీ

- బి వీరన్న, సిపిఐ (ఎం.ఎల్)

- మురహరి, ఎస్‌యుసిఐ (సి)

- జానకి రాములు, ఆర్‌ఎస్‌పి

రాష్ట్ర సదస్సు నిర్ణయాలకు ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ మద్దతు తెలియజేసింది.

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వర రావు స్వాగతం పలికి వ్యక్తలను వేదికపైకి ఆహ్వానించారు.